# 28

# యేసు అధికారమునకు ఒక సవాలు

## (12:22-37)

ఒక చిన్న విరామము తరువాత (12:15–21), యేసు మరియు పరిసయ్యులకును మధ్య సంభవించిన సంఘర్షణను వర్ణించుటకు మత్తయి వెనుదిరిగాడు. ఈ ఇరువర్గముల మధ్య ఏర్పడిన ఈ అధ్యాయములోని ఇదివరకటి ఘర్షణలు సబ్బాతును ఆచరించు సమస్యకు సంబంధించినవై యుండినవి (12:1–14). ఈ సమయంలో, యేసు చేసిన అద్భుత కార్యములు ఆయన ఏ అధికారముతో చేసాడన్నది ప్రధాన సమస్యయై యుండినది (12:22–37).

### పరిసయ్యుల అబద్ధ నేరారోపణ (12:22–24)

**22అప్పుడు దయ్యముపట్టిన గ్రుడ్డివాడును మూగవాడునైన యొకడు ఆయనయొద్దకు తేబడెను. ఆయన వానిని స్వస్థపరచినందున ఆ మూగవాడు మాటలాడు శక్తియు చూపును గలవాడాయెను. 23అందుకు ప్రజలందరు విస్మయమొంది–ఈయన దావీదు కుమారుడు కాడా, అని చెప్పుకొనుచుండిరి. 24పరిసయ్యులు ఆ మాట విని–వీడు దయ్యములకు అధిపతియైన బయెల్జెబూలువలననే. దయ్యములను వెళ్లగొట్టుచున్నాడు గాని మరియొకనివలన కాదనిరి.**

**వచనము 22. దయ్యముపట్టినవాడు ఒకడు,** వాడు గ్రుడ్డివాడు మాత్రమే గాక మూగవాడునై యుండెను, **యేసు యొద్దకు తేబడెను**. ఈ మనుషునిలో ఉండిన రెండు పరిస్థితులు–అంధత్వము మరియు మూగతనము–దయ్యము పట్టినందువలననే కలిగిన ప్రత్యక్ష ఫలితమని అర్థంచేసికొనబడుచున్నది (9:32పై గల వ్యాఖ్యానము చూడు). దయ్యమును వెళ్లగొట్టి, వాని చూపును మరియు నోటి మాటను పునరుద్ధరించుట ద్వారా, యేసు వానిని **స్వస్థపరచాడు**.

**వచనము 23**. ఈ అద్భుతకార్యమును చూచిన **ప్రజలందరు విస్మయమొందిరి** (*existēmi*), లేక “అమితమైన ఆశ్చర్యంలో మునిగిపోయారు.” ఈ సమూహములోని అనేకులు యేసు చేసిన అద్భుతకార్యములను ఇదివరకు చూచియుండవచ్చును, అట్లయినను ఈ అద్భుతకార్యము వారిని ఆశ్చర్యములో ముంచెత్తినది.

యేసు చేసిన అద్భుతకార్యములనుబట్టి ప్రజలందరు అమితంగా విస్మయమొందినను, వాస్తవముగా యేసు ఎవరై యుండెనో వారికి ఖచ్చితంగా తెలిసియుండలేదు (యోహాను 7:12, 40–43; 10:19–21 చూడు). ఆయనే వాగ్దానము చేయబడిన మెస్సీయయై యున్నాడని ఆయన చేసిన అద్భుతకార్యముల వెనుక నుండిన శక్తి సూచించినది. ఏదిఏమైనా, వారు యేసును చూచినప్పుడు, సంచార బోధకుడై యుండిన వినయముగల వడ్రంగి కుమారుడు నిజముగా దేవుడు వాగ్దానము చేసినవాడే అయియుండునా అని

వారు ప్రశ్నించారు. జనసమూహముల అనిశ్చయత అచ్చట పరిసయ్యులుండుట చేత కూడ ప్రభావితము చేయబడి యుండవచ్చును (యోహాను 7:13; 9:22; 19:38 చూడు).

**దావీదు కుమారుడు** అను పదజాలము, మెస్సీయ సంబంధిత ఒక బిరుదు, దాని మూలములను పాత నిబంధనలో కలిగియుండి (2 సమూయేలు 7:12-16; కీర్తనలు 89:3, 4; యెషయా 9:6, 7; యిర్మీయా 23:5) మత్తయి వ్రాసిన సువార్తలో అనేక పర్యాయములు అగుపించుచుండును (1:1పై గల వ్యాఖ్యానము చూడు).[1]

**వచనము 24.** ప్రజలందరు రక్షకుని కొనియాడుచుండిన తీరును చూచి **పరిసయ్యులు** వారి హృదయములలో కలవరపడిరి. ఈ అందోళనయే, దేవుని శక్తికి బదులుగా యేసు, **దయ్యముల అధిపతియై యుండిన బయెల్జెబూలు** శక్తి చేతనే **దయ్యములను** వెళ్లగొట్టుచున్నాడని వారు దేవదూషణ సంబంధిత ప్రకటన చేయునట్లు వారిని ప్రేరేపించినది (9:33, 34; 10:25పైగల వ్యాఖ్యానములను చూడు). యూదులు సాతానును సంబోధించుచుండిన నామములలో "బయెల్జెబూలు" ఒకటై యుండినది, గనుక ఇచ్చట ఉద్దేశింపబడిన వాడు కూడ వాడే అని స్పష్టముగా తెలియుచున్నది. అద్భుతకార్యములే చేయబడలేదనిగాని, అవిలేవని గాని పరిసయ్యులు చెప్పలేకపోయినందు వలన, వారు వాటి మూలమును అపకీర్తిపాలుజేయుటకు ప్రయత్నించారు.[2] యేసు క్రీస్తు యొక్క పేరు ప్రతిష్ఠలను మరియు ప్రజలు ఆయనను సాదరంగా అంగీకరించుచుండిన అంశమును నాశనము చేయవలెననుదే వారి గురియై యుండినది.

## యేసు తన అధికారమును ప్రతిరక్షించుకొనుట (12:25-30)

**25ఆయన వారి తలంపుల నెరిగి వారితో ఇట్లనెను-తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడై పోవును. తనకుతానే విరోధముగా వేరుపడిన యే పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు. 26సాతాను సాతానును వెళ్లగొట్టినయెడల తనకుతానే విరోధముగా వేరుపడును; అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును? 27నేను బయెల్జెబూలువలన దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవరివలన వాటిని వెళ్లగొట్టుచున్నారు? కాబట్టి వారే మీకు తీర్పరులైయుందురు. 28దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చి యున్నది. 29ఒకడు మొదట బలవంతుని బంధింపని యెడల యేలాగు ఆ బలవంతుని యింటిలో చొచ్చి అతని సామగ్రి దోచుకొనగలడు? అట్లు బంధించినయెడల వాని యిల్లు దోచుకొనును. 30నా పక్షమున నుండనివాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు.**

**వచనము 25.** పరిసయ్యులు మోపుచుండిన నిందను-యేసు బయెల్జెబూలు శక్తి చేతనే దయ్యములను వెళ్లగొట్టుచున్నాడనునది (12:24) వారు యేసు ముఖము యెదుటనే పలుకలేదు. ఆ మాటలు జనసమూహములో చెప్పుకొనబడుచుండగా వీరు వినియుందురు. ఆ మాటలు **యేసుకు** వినబడలేదు, కానీ ఆయన **వారి తలంపులను** ఎరిగియుండెను (9:4; యోహాను 2:24, 25 చూడు).

యేసు చూపిన తొలి ప్రతిస్పందన ద్వారా, పరిసయ్యులు ఆయన మీద మోపిన

నిందలో గల అర్థరాహిత్యమును ఆయన సూచించాడు. ఆయన సూచించుచుండిన నైజము ఎంత యథార్థమైనదో స్థిరపరచుటకు యేసు, **ఏ రాజ్యమైనను, పట్టణమైనను, లేక ఇల్లైనను** అను మూడు ఉదాహరణములను ప్రయోగించాడు. పేర్కొనబడిన ఈ పోలికలన్నియు ప్రధానంగా ప్రజలను సూచించుచున్నవి: ఒక రాజ్యములోని పౌరులు, ఒక పట్టణములోని వాస్తవ్యులు, మరియు ఒక కుటుంబములోని సభ్యులు. వీటిలో ఏదైనను **తనకుతానే విరోధముగా వేరుపడినట్లయితే, అది నిలువజాలదు**. యేసు ప్రయోగించిన ఈ పదజాలము లోకోక్తి విధానమునకు చెందినదై యుండునని క్రెయిగ్ ఎస్. కినర్ తలంచాడు.[3] అంతరంగ విరోధము నాశనమునకు నడుపుననునది ఒక సుప్రసిద్ధమైన విషయమై యుండినది, గనుక యేసు బోధలు వినుచుండిన శ్రోతలు ఈ సత్యమును గూర్చి బాధాకరంగా బోధింపబడినవారై యుండిరి. ఇశ్రాయేలు యొక్క ప్రాచీన రాజ్యము సొలోమోను యేలుబడి తదుపరి విభాగింపబడినది (1 రాజులు 12:1-24), గనుక రాజ్యములో విడిపోయిన రెండు భాగములు చివరకు బబులోను మరియు అష్షూరు చెరల సమయంలో కూకటివేళ్లతో పెల్లగింపబడినవి (2 రాజులు 18:9-12; 25:1-21).

**వచనము 26.** సత్యమును ఉదాహరణంగా చిత్రీకరించిన తరువాత, యేసు దానిని అందుబాటులో నుండిన పరిస్థితికి అన్వయించాడు: **సాతాను సాతానును వెళ్లగొట్టినయెడల, తనకుతానే విరోధముగా వేరుపడును; అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును**? ఇది సాతానుకు, మోసము చేయు బుద్ధి మరియు యుక్తిగలవాడునై యున్నవానికి, వాడు తనకుతానే వ్యతిరేకించునట్లు వానికి ఎటువంటి అర్థమునీయదు (ఆదికాండము 3:1; 1 పేతురు 5:8). ఏలయనగా ప్రజలకు నానావిధములైన యాతనలు కలుగజేయు నిమిత్తమై వాడు పంపిన దయ్యములను తానే ఓటమిపాలగునట్లు ఎందుకు వెళ్లగొట్టును?

సాతాను కూడ ఒక "రాజ్యము" కలిగియున్నాడని యేసు పరిసయ్యుల నడిగిన ప్రశ్న బయలుపర్చుచున్నది. పౌలు దీనిని "సాతాను అధికారము" (అపొస్తలుల కార్యములు 26:16-18) అనియు "అంధకార సంబంధమైన అధికారమనియు" (కొలొస్సయులకు 1:13) వర్ణించుచున్నాడు. క్రైస్తవుని పోరాటము సాతాను రాజ్యమునకు-"ప్రధానులు," "ప్రస్తుత అంధకార సంబంధులగు లోక నాథులు," మరియు "ఆకాశమండలమందున్న దురాత్మల సమూహమునకు"-విరోధముగా జరుగుచున్నదై యున్నది (ఎఫెసీయులకు 6:12).

**వచనము 27.** తీర్పు తీర్చుటలో పరిసయ్యులు ప్రదర్శించిన పొంతనలేనితనమును క్రీస్తు బట్టబయలు చేయుట కొనసాగించుచున్నాడు. ఆయన **బయెల్జెబూలు** శక్తి చేత **దయ్యములను** వెళ్లగొట్టుచుండెనని వారు ఆరోపించారు. అందుకు యేసు, **మీ కుమారులు ఎవరివలన వాటిని వెళ్లగొట్టుచున్నారు**? అని వారిని ప్రశ్నించాడు. ఈ "కుమారులు" పరిసయ్యులను వెంబడించుచు, దయ్యములను వెళ్లగొట్టగల శక్తి వారికుండినదని సాధికారంతో చెప్పుకొనుచుండిన కొందరు శిష్యులై యుండిరి.[4] "మేము చేయగలమని" వారు సాధికారంతో చెప్పుకొనుచుండిన అదే పని యేసు చేయుచుండినను, ఆయన అపవాదితో చేతులు కలిపాడని వారు ఎందుకు నిందిచారు? పరిసయ్యులను వెంబడించుచుండినను, ఆయన అపవాదితో చేతులు కలిపాడని వారు ఎందుకు నిందించారు? పరిసయ్యులను వెంబడించుచుండిన ఈ శిష్యులు సాతాను శక్తి చేత భూతవైద్యమునకు సంబంధించిన క్రతులు చేయుచుండిరని

నిందింపబడలేదు. అలాగైతే, యేసు ఎందుకు నిందింపబడినాడు? **వారే మీకు తీర్పరులై యుందురని** యేసు చెప్పుటలో, పరిసయ్యులు ఏ కొలత చొప్పున వారి శిష్యుల భూతవైద్య కార్యములను సమర్థించుచుండిరో, న్యాయసమ్మతముగా నుండునట్లు, అదే కొలతను ఆధారంచేసికొని వారు యేసును సహితము సమర్థించవలసి యుండినదని ఆయన సహేతుకముగా వాదించుచుండిన భావముండినది.

**వచనము 28.** తర్కబద్ధంగా చూచినట్లయితే, యేసును వ్యతిరేకించుచుండిన శత్రువులు యూదులులో భూతవైద్యం చేయుచుండినవారు మోసగాళ్లని అంగీకరింపవలసి యుండినది లేదా యేసు అదే అధికారము చేత, అనగా దేవుని శక్తి చేత **దయ్యములను వెళ్లగొట్టాడని** ఒప్పుకొనవలసి యుండినది. వాస్తవముగా ఆయన **దేవుని ఆత్మ** శక్తిని వాడుకొనుచుండినట్లయితే, **దేవుని రాజ్యము** వారి మధ్యకు వచ్చియున్నది వారు గుర్తించవలసి యున్నదని యేసు వారికి సుస్పష్టంగా సూచించాడు. "దేవుని ఆత్మకు" బదులుగా "దేవుని వ్రేలు" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 11:20; నిర్గమకాండము 8:19; 31:18; కీర్తనలు 8:3 చూడు).

"దేవుని రాజ్యము" అను పదజాలము మత్తయి వ్రాసిన సువార్తలో కేవలము నాలుగు పర్యాయములు మాత్రమే అగుపించును (12:28; 19:24; 21:31, 43). "పరలోక రాజ్యము" అను పదజాలము మత్తయికి ఎక్కువ ప్రీతికరమైనదై యుండినది. ఈ రెండు పదజాలములు ఒకే వ్యవస్థ యొక్క వెవ్వేరు శీర్షికలై యున్నవి. ఈ రాజ్యము పరలోకమందు ప్రారంభమైనదై యుండి దేవునికి చెందినదై యున్నది. ఈ నాడు ఈ రాజ్యమును ఆయన కుమారుడు, పరలోకమందున్న తన సింహాసనము మీద ఆసీనుడై పరిపాలించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 2:22–36). సంఘము ఆ రాజ్యమై యున్నది (16:18, 19). ఈ రాజ్యము పెంతెకొస్తు దినము వరకు కూడ లాంఛనప్రాయంగా ప్రారంభింపబడకపోయినప్పటికిని, ఈ సమయంలో అది క్రీస్తు యేసు చేయుచుండిన శక్తివంతమైన కార్యముల ద్వారా లోకములో ప్రవేశించుచుండినది.

**వచనము 29**. యేసు దోచుకొనబడుచుండిన **బలవంతుని ఇంటిని** గూర్చిన ఒక చిన్న ఉపమానమును తన శ్రోతలకు తెలియజెప్పాడు (యెషయా 49:24–26 చూడు). బలవంతుడు **మొదట** బంధింపబడితేనే **తప్ప** ఇది అసాధ్యము. ఈ ఉపమానములోని **బలవంతుడు** స్పష్టముగా సాతానును సూచించుచున్నాడు. అతని **ఇల్లు** బహుశా వాని రాజ్యమును సూచించును, అనగా, వాని అధికారము క్రింద నున్న లోకము. **వాని సామగ్రి** దయ్యములు నివసించుచుండువారిని సూచించుచున్నది. "సామగ్రి" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదమును (*skeuos*) "పాత్రలు" అని కూడ అనువదింపవచ్చును. సామగ్రితో పాటుగా, మానవ శరీరములను సూచించుటకు కూడ ఈ పదము ప్రయోగింపబడుచున్నది (అపొస్తలుల కార్యములు 9:15; 2 కొరింథీయులకు 4:7; 1 థెస్సలొనీకయులకు 4:4, 5; 2 తిమోతి 2:20, 21; 1 పేతురు 3:7). ఈ పదమునకున్న సర్దుకుపోయే స్వభావమునుబట్టి అది ఈ ఉపమానములో ఒక ప్రత్యేకమైన రీతిలో ఉపయోగపడుచున్నది.

యేసు సాతానును మొదట బంధించనంత వరకు వాని పరిపాలనా ప్రదేశములలోనికి ఆయన **ప్రవేశింపలేకపోయాడు** (ప్రకటన 20:2 చూడు). **బంధించుట** అని అర్థమిచ్చు గ్రీకు పదమును (*deō*) "నిర్బంధించుట" లేక "కట్టుదిట్టములో నుంచుట" అను అర్థములు కూడ

కలవు. అయినను, సాతాను వాని అధికారము నుండి సంపూర్తిగా రిక్తుడుగావింపబడినాడని దీని అర్థము కాదు. సాతాను అధికార పరిధిని యేసు ఆక్రమించుకొన్నాడు గనుక వాని వశమైనవారిని ఆయన విడిపించాడని ఈ ఉపమానము సూచించుచున్నది. దయ్యముల చేత పట్టబడి పీడింపబడుచుండినవారి జీవితములను ప్రభువు తిరిగి తన సొంతం చేసికొనుచుండెను.

**వచనము 30. నా పక్షమున నుండనివాడు నాకు విరోధి** అంటూ యేసు తన శ్రోతలను హెచ్చరించాడు. ఒకడు, ఆయన చేసిన అద్భుతకార్యములను యేసు దేవుని పరిశుద్ధాత్మ శక్తి చేతనే చేసాడని విశ్వసించవలెను లేదా ఆయన ఆ కార్యములను అపవాది శక్తి చేత చేసాడని వాడు చెప్పవలెను. యేసు యెడల ఏ ఒక్కరైనను తటస్థంగా ఉండజాలరు. ఆయన ఎవరై యుండెనని యేసు సాధికారంతో సెలవిచ్చాడో, ఆయనే అదైయుండెను, లేదంటే ఈ లోకములోనికి వచ్చిన అసంఖ్యాకమైన అబద్ధ ప్రవక్తలలో ఆయన కూడ ఒకడై యుండెను. ఒకడు యేసు పక్షమున నుండును, లేదా వాడు ఆయనకు విరోధముగా నుండును (10:32, 33).

**నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు** అని కూడ యేసు సెలవిచ్చాడు. ఇదివరకటి వాక్యభాగములలో వలెనే (9:36; 10:6, 16), ఆయన భాష కాపరి తన గొఱ్ఱెలను కాయుచుండిన సన్నివేశముపై ఆధారపడి యుండినది (1 రాజులు 22:17; యెషయా 40:11; యిర్మీయా 31:10; యెహెజ్కేలు 34:11–16; మీకా 2:12; నహూము 3:18; జెకర్యా 13:7). కాపరి యేసు పక్షమున నుండి ఆయన గొఱ్ఱెలను సమకూర్చును, లేదా వాడు యేసుకు విరోధముగా పనిచేయును గనుక వాటిని వెవ్వేరు దిశలకు చెదరగొట్టును.

### పరిశుద్ధాత్మకు వ్యతిరేకమైన దేవదూషణ (12:31, 32)

**31కాబట్టి నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు చేయు ప్రతి పాపమును దూషణయు వారికి క్షమింపబడును గాని ఆత్మ విషయమైన దూషణకు పాప క్షమాపణ లేదు. 32మనుష్యకుమారునికి విరోధముగా మాటలాడువానికి పాపక్షమాపణ కలదుగాని పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు.**

**వచనము 31.** ఆయన తన ముగింపు తీర్పులో యేసు ప్రస్తావించిన **పాపము** తరుచుగా "క్షమింపబడజాలని పాపము" అని పిలువబడుచున్నది. పరిశుద్ధ సత్యవేదము ఈ పదమును ప్రయోగించదు, కానీ ఈ **పాపము క్షమింపబడదని** యేసు సెలవిచ్చాడు. అలాగైతే క్షమింపబడజాలని ఈ పాపము ఏమైయున్నది? ఈ పరిసయ్యులు ఏంచేసారు? వారు **పరిశుద్ధాత్మ** శక్తిని అపవాది శక్తి యని ఆరోపించారు. ఆత్మ చేత చేయబడినవని వారు చెప్పుచుండిరి (మార్కు 3:30). కాబట్టి వారు పరిశుద్ధాత్మకు విరోధముగా దేవదూషణ చేసినవారయ్యారు. దాని అత్యంత సంకుచితమైన అవగాహనలో, **దేవదూషణ** (*blasphēmia*) దేవత్వము గూర్చి పలుకబడు అవహేళనాత్మకమైన మాటలను సూచించుచున్నది.

పరిశుద్ధాత్మకు విరోధముగా చేయబడిన దేవదూషణ గూర్చి యేసు చేసిన హెచ్చరిక, ధిక్కారముతో పాపము చేసినవారి గూర్చి చెప్పబడిన పాత నిబంధన సంబంధమైన

శాసనమునకు సరిపడుచున్నది. “అయితే దేశమందు పుట్టినవాడే గాని, పరదేశియేగాని యెవడైనను సాహసించి పాపము చేసిన యెడల [‘పై అధికారుల అండతో’ (RSV)], వాడు యెహోవాను తృణీకరించినవాడగును గనుక అట్టివాడు నిశ్చయముగా జనులలో నుండకుండ కొట్టివేయబడునని” సంఖ్యాకాండము 15:30 సెలవిచ్చుచున్నవి. యెహోవా “వానిని క్షమింపనొల్లడు”; “యెహోవా అతని పేరు ఆకాశము క్రింద నుండకుండ తుడచివేయును” అంటూ విగ్రహారాధికులును తిరుగుబాటుదారులునైనవారి గూర్చి కూడ ద్వితీయోపదేశకాండము 29:20 సెలవిచ్చుచున్నది.

**వచనము 32. మనుష్యకుమారునికి విరోధముగా మాటలాడువానికి** పాపక్షమాపణ సాధ్యమే అని యేసు సెలవిచ్చాడు. అటుతరువాత, పేతురు యేసును ఎరుగనని ముమ్మారు బొంకాడు, అట్లయినను అతడు యేసు చేత క్షమింపబడి సేవకుడుగా పునఃరుద్ధరింపబడెను (26:69–75; యోహాను 21:15–17). పౌలు “దూషకుడును, హింసకుడును, హానికరుడునై యుండినప్పటికిని,” అతనికి కూడ క్షమాపణ లభించినది (1 తిమోతి 1:13; అపొస్తలుల కార్యములు 9:1, 2 చూడు).

అట్లయినప్పటికిని, పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడు ప్రతి ఒక్కరి యెడల క్షమాపణ సాధ్యము కాదు. క్షమాపణ లభించుట కష్టముగా నున్నదని తెలియజెప్పు అనేక గ్రంథ పాఠములలో ఇది ఒకటై యున్నది (హెబ్రీయులకు 6:4–6; 10:26–31; 1 యోహాను 5:16, 17). ఈ పాపము విశ్వాసమునకు ఆధారమైన విషయమునే తృణీకరించుటకు సంబంధించినదై యున్నదని ఆలోచించుటకు జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఉన్ముఖుడై యుండెను:

> మనుష్యకుమారుని కంటే పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడుట ప్రాణాంతకమెనదై యుండుట ఎందుకు ఎక్కువ నిశ్చయమైన నిజమై యున్నదో, కొంత మేరకు మన అవగాహన శక్తులకు అందని ఆవలి పరిధులలో ఉండవచ్చును: కానీ పరిశుద్ధాత్మకు విరోధముగా మాట లాడువాడు పరిశుద్ధాత్మ ఇచ్చు సాక్ష్యమునుబట్టి తదుపరి ఒప్పింపబడి, ఒక విశ్వాసియగునని మాత్రం మనకు తెలియును. కానీ పరిశుద్ధాత్మ చేత ఇవ్వబడిన నిదర్శనమును అతడు తృణీకరించి దానిని అపవాదకి ఆపాదించినట్లేయితే, వాడు విశ్వసించుటకు ఆధారమై యున్న ఒకే ఒక నిదర్శనమును తృణీకరించుచున్నవాడగును మరియు విశ్వాసము లేకుండా క్షమాపణ లభించదు.[5]

కాబట్టి, యేసు “క్షమింపబడజాలని పాపము” గూర్చి చర్చించుచుండినప్పుడు, ఆయన చేయుచుండిన అద్భుతకార్యములు బయెల్జెబూలు (సాతాను) శక్తి చేత చేయబడుచున్నవని చెప్పుచు, ఆయన పరిచర్యను నాశనము చేయుటకు ప్రయత్నించుచుండిన పరిసయ్యుల నుద్దేశించి ఆయన సంబోధించుచుండెను.

### చెట్టు మరియు దాని ఫలము (12:33–37)

**33చెట్టు మంచిదని యెంచి దాని పండును మంచిదే అని యెంచుడి; లేదా, చెట్టు చెడ్డదని
యెంచి దాని పండును చెడ్డదే అని యెంచుడి. చెట్టు దాని పండువలన తెలియబడును.
34సర్ప సంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు?
హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా 35సజ్జనుడు తన
మంచి ధననిధిలో నుండి సద్విషయములను తెచ్చును; దుర్జనుడు తన చెడ్డ ధననిధిలోనుండి**

**దుర్విషయములను తెచ్చును. [36]నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటనుగూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసియుండును. [37]నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పునొందుదవు. నీ మాటలనుబట్టియే అపరాధివని తీర్పునొందుదువు.**

**వచనము 33**. ఇంతకు మునుపు, కొండ మీద ప్రసంగములో, యేసు అబద్ధ ప్రవక్తల గూర్చి చెప్పుచు, "వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురు ... మంచి చెట్టు కాని ఫలములు ఫలింపనేరదు, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదని" సెలవిచ్చాడు (7:16–18). ఇప్పుడు కూడ యేసు **చెట్టు మరియు దాని ఫలమును** గూర్చిన ప్రతిరూపమును ప్రయోగించుచున్నాడు. ఈ ప్రకటన సూటిగా పరిసయ్యుల నుద్దేశించి పలుకబడినది. ఏలయనగా యేసు అపవాది శక్తి చేత దయ్యములను వెళ్లగొట్టుచుండెనని పలుకుచు, వారు తమ హృదయములలో నుండి యేసుకు విరోధమైన చెడు ఆరోపణలను వెలుపలికి తెచ్చుచుండిరి. "ఒక చెట్టు సాగుచేయబడిన తీరును దాని ఫలము బయటపెట్టును ఆలాగుననే ఒకని నోటి మాటలు వాని మనస్సు మలుచుకొనబడుచుండు విధానమును బయటపెట్టునని" (NRSV) అపొక్రిఫలో, సిరాక్ 27:6 చెప్పుచున్నది.

**వచనము 34**. ఆయనను విమర్శించుచుండినవారిని యేసు **సర్ప సంతానమా** అని సంబోధించాడు. యోర్దాను నదిలో అతని చేత బాప్తిస్మము పొందవలెనని ఆయన యొద్దకు వచ్చిన పరిసయ్యులను మరియు సద్దూకయ్యుల నుద్దేశించి బాప్తిస్మమిచ్చు యోహాను ఇదే అభివ్యక్తమును ఉపయోగించాడు (3:7). సంతానము అని అర్థమిచ్చు గ్రీకు పదమును "కుమారులు" (*gennēma*) అని కూడ అనువదించవచ్చును (23:29–33 చూడు). "సర్పము" (*echidna*) అను పదము మధ్యధరా ప్రదేశములో వాసముచేయుచుండిన నానావిధములైన విష సర్పములకు అన్వయింపబడవచ్చును. పౌలు మెలితే ద్వీపములో నున్నప్పుడు చలి కాచుకొనుటకు పుల్లలేరి నిప్పుల మీద వేసినప్పుడు ఒక సర్పము ఆయనను కాటువేసినది (అపొస్తలుల కార్యములు 28:3–6). ఇటువంటి పాము కాటు భరింపశక్యముకాని బాధను, నొప్పిని కలుగజేయును సరికదా, ప్రాణాన్ని కూడ తీసివేయగలదు.

పరిసయ్యులు, విష సర్ప సంతానమువలె, ఆ యా ప్రదేశములందు గుంపులు గుంపులుగా సంచరించుచు, మానవుల చేత కల్పింపబడి విషపూరితమైనవై యుండిన వారి సిద్ధాంతములను వెళ్లగ్రక్కుచుండిరి (23:15). వారు చేయుచుండిరి అవినీతికరములైన బోధలు శ్రోతల హృదయాలను విషమయం చేయుచు, దేవుని సత్యమును వారు గ్రహించకుండునట్లు వారి మనో ద్వారములను మూసివేసినవి.

ఆయనను విరోధముగా మాటలాడినవారు వారి సొంత ప్రకటనల చేతనే ఖండింపబడుచున్నారని యేసు చూపించాడు. **మీరు చెడ్డవారై యుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు? ఏలయనగా హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా?** అని ఆయన చెప్పాడు. వారు భక్తిగల మరియు పూజనీయమైన భావభంగిమలు ప్రదర్శించారు, కానీ వారి హృదయములు ఎంత అవినీతిమయమై యుండినవో వారి నోరు మాటలాడుచుండినది (15:18, 19 చూడు).

**వచనము 35.** గ్రీకు పదము *thēsauros*, **నిధిని** గాని లేదా అది ఉంచబడిన–ఒక "నిక్షిప్త నిధి" లేక "గిడ్డంగి" వంటి–ఒక స్థలమును గాని సూచింపవచ్చును (2:11; 6:19,

20పై గల వ్యాఖ్యానములను చూడు). ఒకని హృదయము నిండియుండు దానిని బట్టి వాని నోరు మాటలాడుచుండును. ఒకని హృదయములో **మంచి** ఆలోచనలు మరియు మాటలు ఉన్నట్లయితే, వాడు మాటలాడునది కూడ మంచియే అయియుండును. మరొక ప్రక్క ఒకడు తన హృదయాన్ని **చెడు**తో నింపుకొనియున్నట్లయితే, వాని నోట నుండి బయటకు వచ్చేది కూడా చెడే అయియుండును. ఒకడు నిజముగా వాని హృదయాంతరంగములో ఏమై యున్నాడో, దానిని తరుచుగా వాని నోరు బయటపెట్టును (సామెతలు 4:23, 24 చూడు).

**వచనములు 36, 37**. **వారు మాటలాడిన అజాగ్రత్తతో కూడిన ప్రతి మాటకు వారు తీర్పు దినాన లెక్క ఒప్పజెప్పవలసి యుండునని** యేసు తన శ్రోతలను హెచ్చరించాడు. "అజాగ్రత్తతో కూడిన" (*argos*) అను పదమును "వ్యర్థమైన" లేక "నిష్ప్రయోజనకరమైన" అని కూడ అనువదింపవచ్చును. ఇచ్చట యేసు ఈ రోజుల్లో ప్రజలు సర్వసాధారణంగా "పనిలేని" మాటలు అని చెప్పుకొను మాటలను సూచింపలేదు. కానీ, ఆయన ద్రోహచింతనగల, హానికరమైన, అపకీర్తిపాలుజేయు మాటలను సూచించుచుండెను.[6] ఇటువంటి నిరర్థకమైన మాటలు ఎటువంటి మంచినైనను కలుగజేయవు, గనుక ఆ మాటలు తీర్పు లోనికి తేబడును. ఒకని నోటి మాటలనుబట్టి వాడు **నీతిమంతుడని సమర్థింపబడును** లేదా **ఖండింపబడును.** ఒకని నోటి మాటలు వాని అసలు స్వభావమును బయలుపరచును గనుక దేవుని సముఖమందలి తీర్పు నాడు అవే మూలాధారమై యుండును.

## ✧✧✧✧✧ పాఠములు ✧✧✧✧✧

### నీతివంతమైన తీర్పు (12:22-30)

క్రీస్తుకు పూర్వం అనేక శతాబ్దముల క్రితం, ప్రవక్తయైన యెషయా ఒప్పింపును కలుగజేయు ఈ పలుకులు ప్రవచించాడు: "కీడు మేలనియు, మేలు కీడనియు చెప్పుకొని& చీకటి వెలుగనియు, వెలుగు చీకటనియు ఎంచుకొనువారికి శ్రమ చేదు తీపి అనియు, తీపి చేదనియు ఎంచుకొనువారికి శ్రమ!" (యెషయా 5:20). పరిసయ్యులు పరిశుద్ధాత్మ శక్తిని బయెల్జెబూలు, దయ్యముల అధిపతియైనవాని శక్తి యని తప్పుగా ఆరోపించినప్పుడు, వారు ఈ విధమైన విపరీతబుద్ధిగల తీర్పును ప్రదర్శించుచుండిరి. దీనికి తారతమ్యంగా, మనము మన అనుదిన వ్యవహారములలో నీతివంతమైన తీర్పులు ప్రదర్శింపవలసి యున్నది. మనము వాస్తవములను పునసమీక్ష చేసికొనుచు, ఒక తుది అభిప్రాయమునకు రాక మునపు నిదర్శనమును న్యాయసమ్మతముగా మదింపు చేయవలెను. మనము ముందుగానే ఊహించుకొనిన భావాలు, మన స్వయం ప్రయోజనములు, మరియు పూర్వాభిప్రాయములు మన తుది అభిప్రాయములలో వైషమ్యము కలుగజేయబడకుండునట్లు మనము తగు జాగ్రత్తపరులమై యుండవలెను. యేసు, "వెలి చూపునుబట్టి తీర్పు తీర్చక, న్యాయమైన తీర్పు తీర్చుడి" అని ఉపదేశించాడు (యోహాను 7:24).

డేవిడ్ స్టూవర్ట్

### వేరుపడిన ఇల్లు (12:25)

"వేరుపడిన ఒక ఇల్లు" గూర్చిన సోదాహరణ చిత్రీకరణము తరుచుగా అబ్రాహాము లింకన్ విషయంలో ఆరోపింపబడుచుండినది, ఏలయనగా ఆయన చేసిన అత్యంత ప్రసిద్ధిగాంచిన ఉపన్యాసములలోని ఒక ఉపన్యాసములో ఆయన దానిని ఒక ప్రధానాంశముగా ప్రయోగించాడు. లింకన్, ఆ రోజుల్లో సెనేట్‌కు ఒక అభ్యర్థియై యుండెను కానీ అటుతరువాత అమెరికా సంయుక్త రాష్ట్రముల అధ్యక్షుడయినవాడు, "తనకుతానే వేరుపడిన ఇల్లు నిలువజాలదు. ఈ ప్రభుత్వము, సగము శాతం బానిసలుగాను సగము శాతం స్వతంత్రులుగాను ఉంటూనే శాశ్వతంగా నిలువజాలదని నేను నమ్ముచున్నానని" ఘోషించాడు.[7] లింకన్, పరిశుద్ధ సత్యవేదమును అంకితభావంతో అధ్యయనము చేయుచుండెను గనుక ఈ విధంగా ఆయన యేసు భాషను అరువు తెచ్చుకొన్నాడు.

ఏ వ్యవస్థయైనను కూలిపోవుటకు విభజన ఒక కారణముకాగలదని ప్రభువు సూచించుచుండెను. అంతర్యుద్ధములు అనేక దేశములను విభజించి వాటి పతనమునకు హేతువయ్యాయి. ఒక సమాజము, ఒక సంఘ సమూహము, లేక ఒక కుటుంబములోని విభజన కూడ ప్రమాదమునకు దారితీస్తోంది. దీనికి తారతమ్యముగా, క్రైస్తవులు మాదిరి పౌరులుగాను, సంఘ సభ్యులుగాను, మరియు కుటుంబ సభ్యులుగాను ఐకమత్యమును ప్రోత్సాహించాలి (1 పేతురు 2:17; ఎఫెసీయులకు 4:3; 5:22–6:4).

### బలవంతుని బంధించుట (12:29)

దయ్యములను వెళ్లగొట్టుట ద్వారా, ఆయనకు సాతానుపై అధికారమున్నదని యేసు ప్రదర్శించాడు; ఆయన బలవంతుని బంధించి వాని ఇంటిని దోపిడీచేసాడు. ఈ నాడు, మనము లోకములో నున్న సమస్త దుష్టత్వమునుబట్టి సులభముగా నిరుత్సాహపరులమగుచున్నాము. "మనలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటే గొప్పవాడని" మనము జ్ఞాపకముంచుకొనవలెను (1 యోహాను 4:4). "తప్పు తరుచుగా బలమైనదిగా అగుపించుచున్నది, అట్లయినను ఏలుచున్నవాడు దేవుడే" అని మనకు సుపరిచితమైన ఒక సంగీతము గుర్తుచేయుచున్నది.[8] "ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగా, మనకు విరోధి యెవడు?" అని పౌలు రచించాడు (రోమా 8:31; NIV). "ఒకడు మరియు దేవుడు కలిస్తే, ఆ ఇద్దరే అధిక సంఖ్యాకులౌదురు" అని చెప్పబడి యున్నది.[9] సాతాను సంఘటింపబడి శిక్ష విధింపబడి యున్నాడు; వాని అంతిమ గ్రహపాటు ఇదివరకే ముద్రింపబడి యున్నదని మనము జ్ఞాపకముంచుకొనవలెను (ప్రకటన 20:10).

డేవిడ్ స్టూవర్ట్

### అజాగ్రత్తతో కూడిన మాటలు (12:36, 37)

ఒకడు బహిరంగముగా మాటలాడునప్పుడు వాని మాటల గూర్చి తగు జాగ్రత్త వహించును, అట్లయినను ఏకాంతముగా నున్నప్పుడు సడలింపబడిన అదే నాలుకతో నీచమును అసహ్యకరమునైన మాటలు మాటలాడును. భక్తుడైన యాకోబు ఇలా వ్రాసాడు,

> యే నరుడును నాలుకను సాధుచేయనేరడు, అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే. దీనితో తండ్రియైన ప్రభువును సుత్తింతుము, దీనితోనే దేవుని పోలికెగా పుట్టిన మనుష్యులను శపింతుము ఒక్కనోటనుండియే ఆశీర్వచనమును

శాపవచనమును బయలువెళ్లును; నా సహోదరులారా, యీలాగుండ కూడదు. నీటిబుగ్గలో ఒక్క జెలనుండియే తియ్యని నీరును చేదునీరును ఊరునా? (యాకోబు 3:8–11).

మన నోటి మాటలను దేవుడు గమనించుచుండును, గనుక మనము వాటి గూర్చి లెక్క ఒప్పుజెప్పవలసి యున్నది. మన నోట నుండి వెలువడు ప్రతి మాటను దేవుడు వినుచున్నాడని మనము నమ్మినట్లయితే, మన మాటల తీరు, అంశము, అర్థము ఎంతో భిన్నముగా నుండును కాదా! మన నోటి మాటలు ఇహలోక జీవితంలో ఇతరులకు హని కలిగించగలవు మరియు వారు మనల గూర్చి ఘోరాతిఘోరంగా ఆలోచించునట్లు కూడ చేయగలవు, అయితే అజాగ్రత్తతో కూడిన మాటల్లో గల అపాయము అది కాదు. అసలు అపాయము, యేసు సంకేతించి సూచించినట్లు. మనము దేవుని సముఖమందు నిలువబడి యుండు ఆ గొప్ప తీర్పు దినాన బయటపడు ఈ మాటల పర్యవసానమై యున్నది. మన నోటి మాటలు మనలను నీతిమంతులనుగా తీర్చును లేదా ఖండించును.

---

సూచనలు

[1]*Psalms of Solomon* 17.21 చూడు. [2]యేసు దయ్యముపట్టినవాడని యూదులలోని ఇతరులు ఆయనను నిందించారు (యోహాను 7:20; 8:48, 52; 10:20). అటుతరువాతి కాలములో, ఆయన ఒక భూతవైద్యుడని ఆయన యందు విశ్వసించని యూదుల చేత ముద్రవేయబడినాడు. (Talmud *Sanhedrin* 43a; 107b; Justin Martyr *Dialogue with Trypho* 69; Origen *Against Celsus* 1.28.) [3]Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 363. [4]యూదులలో నుండిన భూతవైద్యుల ఉదాహరణముల కొరకు మార్కు 9:38; అపొస్తలుల కార్యములు 19:13–16; Josephus *Antiquities* 8.2.5; *Wars* 7.6.3; Justin Martyr *Dialogue with Trypho* 85; Irenaeus *Against Heresies* 2.6.2 చూడు. [5]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 110. [6]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 273. [7]Abraham Lincoln, speech delivered to the Republican State Convention, Springfield, Illinois, 16 June, 1858. [8]Maltbie D. Babcock, “This is My Father’s World,” *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [9]Frederick Douglass (http://quotationsbook.com/quote/17251/; Internet, accessed 8 March 2010).